క్లుప్తంగా

అనాథ పిల్లలకు నిత్యావసర వస్తువులు

జమ్మికుంట: జమ్మికుంట మున్సిపల్ పరిధి కొత్తపల్లి గ్రామంలోని స్పందన అనాథ ఆశ్రమ పిల్లలకు ఇల్లందకుంట మండలంలోని మల్లన్నపల్లి గ్రామానికి చెందిన లాయర్ కనుకుల సంజీవరెడ్డి ఆదివారం బకెట్లు, జగ్గులు, మూడు క్వింటాళ్ల బియ్యం, అందజేశారు. ఈసందర్భంగా సంజీవరెడ్డి మాట్లాడుతూ.. అనాథ పిల్లలకు తమవంతు సాయంగా దాతలు ముందుకు రావాలని కోరారు. ఇక ముందు కూడా పిల్లలకు సాయం అందిస్తానని ప్రకటించారు.

వైద్య శిబిరానికి స్పందన

జమ్మికుంట: మున్సిపల్ పరిధిలోని ధర్మారం గ్రామంలో బాలవికాస ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. హన్మకొండలోని లక్ష్మీనరసింహ హాస్పిటల్ వైద్యులు 250 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు తేజస్విని, కౌన్సిలర్లు బొంగోని వీరన్న, మారపల్లి భిక్షపతి, బాల వికాస సిబ్బంది సుమలత, సరోజన, సంధ్యలు ఉన్నారు.

నియామకం

చొప్పదండి: పట్టణానికి చెందిన పొరండ్ల నితీశ్‌ను బీఆర్ఎస్‌వీ చొప్పదండి నియోజకవర్గ ఉపాధ్యక్షుడిగా నియమిస్తున్నట్లు ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ప్రకటించారు. తెలంగాణ ప్రభుత్వం విద్యారంగానికి చేస్తున్న సేవలను ప్రచారం చేయాలని సూచించారు. రాగంపేటకు చెందిన దీకొండ రమేశ్‌ను బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్‌గా నియామకం చేశామని ఎమ్మెల్యే తెలిపారు.

కాంగ్రెస్ మైనార్టీసెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా సలీం

వీణవంక: కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శిగా మండలంలోని బొంతుపల్లి గ్రామానికి చెందిన ఎండీ సలీంను నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు తాజొద్దీన్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సలీం నియామకానికి కృషి చేసిన మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ, నియోజకవర్గ ఇన్‌చార్జి బల్మూరి వెంకట్, కిసాన్ సెల్ అధ్యక్షుడు పత్తి కృష్ణారెడ్డి, టీపీసీసీ సభ్యులు కర్ర భగవాన్ రెడ్డి, ఎండీ సాహెబ్‌హుస్సేన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

చొప్పదండి: మండలంలోని రుక్మాపూర్‌కు చెందిన పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు ఆదివారం బీఆర్ఎస్‌లో చేరారు. గ్రామానికి చెందిన కుమ్మరి అనిల్, సంతోశ్‌కుమార్, రాజు కుమార్, అజయ్, రాకేశ్, తదితరులు పార్టీలో చేరాగా ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ గులాబీ కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు.

'డబుల్' ఇళ్ల పరిశీలన

జమ్మికుంట: పట్టణంలోని డబుల్ బెడ్‌రూం ఇళ్లను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తుమ్మెటి సమ్మిరెడ్డి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా సమ్మిరెడ్డి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నియోజకవర్గానికి నాలుగు వేల ఇళ్లను మంజూరు చేశారని, ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ఏడున్నర ఏళ్లు మంత్రిగా పని చేసినప్పుడు డబుల్ బెడ్ రూం ఇళ్లను ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించాడు. ఈటల మొసలి కన్నీరు కారుస్తూ సీఎంపై లేని పోని ఆరోపణలు చేస్తున్నాడని, ఆయన మాటలను నమ్మే స్థితిలో ప్రజలు లేరని మండిపడ్డారు. ప్రజలపై అభిమానం ఉంటే కేంద్రం నుంచి నిధులు తీసుకొచ్చి ఇళ్లు పూర్తి చేయించాలని డిమాండ్ చేశారు.


భూమిపూజ



భూమిపూజ చేస్తున్న సంఘం బాధ్యులు

హుజూరాబాద్‌రూరల్: పట్టణంలోని ప్రభుత్వాసుపత్రి సమీపంలో విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల భవన నిర్మాణానికి ఆదివారం భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం బాధ్యులు, మండల యూనిట్ విశ్రాంతి ఉద్యోగుల అధ్యక్షుడు ఉస్మాన్‌బాషా, ప్రధాన కార్యదర్శి గోపాల్‌రావు, కార్యవర్గ సభ్యులు, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న మురళి

మానకొండూర్: మండలంలోని నిజాయితీగూడెం గ్రామానికి చెందిన మొగిలి సంపత్‌కు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును సర్పంచ్ బోళ్ల మురళి ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా చెక్కు మంజూరుకు కృషి చేసిన రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కుంభం మొగిలి గడ్డి సంపత్, రాయమల్లు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

- గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న ప్రభుత్వం
- వెలిచాలలో ఇప్పటికే ప్రారంభం
- వెదిరలో ముస్తాబవుతున్న గ్రామీణ గ్రంథాలయం



అందంగా రూపుదిద్దుకున్న వెలిచాల గ్రామీణ గ్రంథాలయం



వెదిరలో ప్రారంభానికి ముస్తాబవుతున్న గ్రామీణ గ్రంథాలయం

రామడుగు: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు. ప్రజలకు అవసరమైన పలు రకాల సమాచారం అందజేయడానికి ప్రభుత్వం గ్రామాల్లో గ్రామీణ గ్రంథాలయాలను ఏర్పాటు చేస్తోంది. అందుబాటులో ఉన్న గ్రంథాలయాలు ప్రజలు సద్వినియోగం చేసుకోనున్నారు. గ్రంథాలయాల్లో పలురకాల దినపత్రికలు, పురాణ, నీతి కథలు పుస్తకాలతో పాటు పలు ప్రభుత్వ ఉద్యోగాలకు పోటీ పరీక్షలకు హాజరవుతున్న యువతకు కావాల్సిన పుస్తకాలను అందుబాటులోకి తీసుకువస్తుండటంతో గ్రామీణులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మండలంలో...

మండల కేంద్రంలో ఇటీవల నూతనంగా గ్రంథాలయం భవనం ప్రారంభించారు. వెలిచాల గ్రామంలో అత్యంత సుందరంగా గ్రామీణ గ్రంథాలయం ఏర్పాటు చేసి ప్రారంభోత్సవం చేశారు. వెదిర గ్రామంలో మరో గ్రామీణ గ్రంథాలయం అందుబాటులోకి రానుంది. జిల్లా గ్రంథాలయంశాఖ అధికారులు పనులు ముమ్మరం చేస్తున్నారు.

పంచాయతీ భవనాల్లో...

వెదిర, వెలిచాల గ్రామాల్లో గ్రామ పంచాయతీలకు చెందిన ప్రత్యేక భవనాల్లో గ్రామీణ గ్రంథాలయాలను అధికారులు ఏర్పాటు చేయడంతో పాఠకులకు ఎంతో ఉపయోగకరంగా ఉండనున్నాయి.

అందంగా ముస్తాబు....

గతంలో గ్రంథాలయం భవనాలు మాములుగా ఉండడంతో పాఠకులను ఆకర్షించేలా ఉండేవి కావు. కాగా గ్రామీణ గ్రంథాలయాల భవనాలకు అందమైన బొమ్మలను వేయడంతో పాఠకులను ఆకర్షిస్తున్నాయి.

రూ. లక్షతో....

వెలిచాల, వెదిర గ్రామాలలో గ్రంథాలయాలకు రూ. లక్ష మేర ఖర్చు చేశారు. గ్రంథాలయానికి అవసరమైన భవనాన్ని అలాగే అందులో పాఠకులకు అవసరమైన కుర్చీలు, బెంచీలు, పుస్తకాల కోసం ర్యాకులను ఏర్పాటు చేశారు. పాఠకులకు అవసరమైన పుస్తకాలు, న్యూస్‌పేపర్లను జిల్లా గ్రంథాలయ సంస్థవారు అందిస్తున్నారు.

సంతోషం వ్యక్తం చేస్తున్న యువత...

గ్రామాల్లో గ్రామీణ గ్రంథాలయాలను ఏర్పాటు చేస్తుండడంతో పలు పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులు, యువత ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు పూర్తి స్థాయిలో పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలను అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు.



వెలిచాలలో ఉద్యోగాలకు సిద్ధమవుతున్న యువత

సద్వినియోగం చేసుకుంటున్నారు



గ్రామంలో రెండు నెలల క్రితం గ్రామీణ గ్రంథాలయం ప్రారంభించాం. గ్రామస్తులు సద్వినియోగం చేసుకుంటున్నారు. యువకులు ఉదయం వేళ గ్రంథాలయానికి వచ్చి అవసరమైన పుస్తకాలను చదువుకుంటున్నారు. అలాగే న్యూస్‌పేపర్లు ఉండడంతో గ్రామస్తులు వచ్చి చదువుకుంటున్నారు.

– వీర్ల సరోజనప్రభాకర్‌రావు, సర్పంచ్, వెలిచాల

ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు..



గ్రామ చావడి వద్ద ఉన్న గ్రామ పంచాయతీకి సంబంధించిన భవనంలో గ్రామీణ గ్రంథాలయం ఏర్పాటు చేయడానికి సిద్ధం చేస్తున్నాం. దీనికి కావాల్సిన వస్తువులను తీసుకువచ్చి త్వరలో అన్ని పుస్తకాలను అందుబాటులోకి తేవడంతోపాటు ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నాం.

– నాగుల రాజశేఖర్‌గౌడ్, వీడీసీ చైర్మన్, వెదిర

మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించిన నాయకులు



పరామర్శిస్తున్న బోయినపల్లి వినోద్‌కుమార్

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట మాజీ సర్పంచ్ నేరెల్ల అంజయ్యగౌడ్ తల్లి లక్ష్మినర్సమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆదివారం ఆమె కుటుంబ సభ్యులను రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, మాజీ ఎమ్మెల్యే ఆరెపెల్లి మోహన్ పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

హుజూరాబాద్: మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక మామ గందె సాంబయ్య ఇటీవల మృతి చెందగా ఆమె కుటుంబాన్ని ఆదివారం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ పరామర్శించారు. మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. మంత్రి గంగులవెంట ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు తదితరులు ఉన్నారు.



పరామర్శిస్తున్న మంత్రి గంగుల

నిధులు మంజూరు చేయాలని వినతి

రామడుగు: మండల కేంద్రానికి చెందిన ముదిరాజ్ సంఘం నాయకులు ఆదివారం కరీంనగర్‌లో ఎంపీ బండి సంజయ్‌కుమార్‌ను కలిసి ముదిరాజ్ సంఘం భవనానికి నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఎంపీని శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు జిట్టవేని అంజిబాబు, బొజ్జ తిరుపతి, సామంతుల మునీందర్, రాజమల్లు, అంజయ్య, కమలాకర్, తిరుపతి, బాలయ్య, కొంరయ్య, మహేశ్, రమేశ్, బీజేపీ నాయకుడు కట్ట రవీందర్ పలువురు పాల్గొన్నారు.

మల్లన్న కుటుంబానికి అండగా ఉంటాం

తిమ్మాపూర్: మండలంలోని మక్తపల్లి గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నేత తమ్మిశెట్టి మల్లయ్య ఇటీవల మృతిచెందగా ఆయన కుటుంబాన్ని ఎంపీ బండి సంజయ్ ఆదివారం పరామర్శిచారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. మల్లన్న కుటుంబానికి పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని పేర్కొన్నారు. మల్లయ్య కొడుకు హరి తండ్రి కోరిక మేరకు నల్లగొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ఎంపీ నిధుల నుంచి రూ. పదిలక్షలు కేటాయించాలని కోరారు. దీనికి బండి సంజయ్ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.



పరామర్శిస్తున్న ఎంపీ బండి సంజయ్

దేశానికి మోదీ నాయకత్వం అవసరం



హుజూరాబాద్: మాట్లాడుతున్న ధర్మేశ్వర్ కొన్వర్



తిమ్మాపూర్: మాట్లాడుతున్న కలిత

హుజూరాబాద్: దేశానికి ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వం చాలా అవసరమని అస్సాం రాష్ట్రం సోనారి నియోజకవర్గ ఎమ్మెల్యే ధర్మేశ్వర్ కొన్వర్ అన్నారు. ఎమ్మెల్యే ప్రవాస్ యోజనలో భాగంగా పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఆదేశాల మేరకు నియోజకవర్గ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. దేశాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రధాని లక్ష్యంతో ముందుకెళ్తున్నారని, భద్రత, ఆర్థికాభివృద్ధి, వ్యవసాయం, వాణిజ్యం, విద్య వంటి అన్ని రంగాల్లోనూ దేశం మెరుగుపడుతుందన్నారు. మోదీ నాయకత్వంలో దేశం ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందన్నారు. నియోజకవర్గ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ పగలు, రాత్రి తేడా లేకుండా ప్రజా సంక్షేమాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో బీజేపీ గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలన్నారు. 21 నుంచి 28వ తేదీ వరకు మండలాల వారీగా పార్టీ కార్యక్రమాలు చేపట్టనున్నామని తెలిపారు. సమావేశంలో అసెంబ్లీ కన్వీనర్ మాడ గౌతమ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు సంపత్‌రావు, ఎమ్మెల్యే ప్రవాస్ యోజన కార్యక్రమ కోఆర్డినేటర్ పుప్పాల రఘు, బీజేపీ జిల్లా కార్యదర్శి బింగి కరుణాకర్, జిల్లా అధికార ప్రతినిధి మాసాడి ముత్యంరావు, కౌన్సిలర్ పైళ్ల వెంకట్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు గంగిశెట్టి రాజు, నాయకులు రాముల కుమార్, జీడీ మల్లేశ్, సంపెల్లి సంపత్‌రావు, ఆదిరెడ్డి తిరుపతిరెడ్డి, శోభన్ తదితరులు ఉన్నారు.

తిమ్మాపూర్: రాష్ట్ర ప్రజల్లో బీజేపీపై ఎంతో ఆదరణ ఉందని బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉందని అస్సాం రాష్ట్రానికి చెందిన ఎమ్మెల్యే దిగ్గంత కలిత అన్నారు. మానకొండూరు నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం అలుగునూర్‌లో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. మానకొండూరు అసెంబ్లీ ఎన్నికల్లో ఆరువేల ఓట్లు వచ్చిన బీజేపీకి పార్లమెంట్ ఎన్నికల్లో డెబ్బై వేల ఓట్లు రావడం గొప్ప విషయమన్నారు. నియోజకవర్గంలో పార్టీకి ఓట్లు వేసేవారు వేల సంఖ్యలో ఉన్నారని దీన్ని పార్టీ కాపాడుకుంటూ గెలుపు దిశగా పయనించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా, రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు

మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం

వీణవంక: మండలంలోని లస్మక్కపల్లి, రామకృష్ణాపూర్ గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన కుటుంబాలకు ఆదివారం ట్యూరిటో, యప్ టీవీ సీఈవో పాడి ఉదయానందన్‌రెడ్డి తన అనుచరుల ద్వారా రూ.10వేలు అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చిన్నాల ఐలయ్య యాదవ్, మ్యాకల సమ్మిరెడ్డి, అబ్దుల్ హమీద్, దాసారపు లోకేశ్, దాసారపు వంశీకృష్ణ, సమ్మయ్య, మధు, సమిండ్ల చిట్టి, శ్రీకాంత్, కుమారస్వామి, ప్రశాంత్, కొంరయ్య, అమృత ప్రభాకర్, శేఖర్ తదితరులు ఉన్నారు.

రైతుబంధు ఇచ్చి సబ్సిడీ పథకాలు ఎత్తివేత

- బీఆర్ఎస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలకు పాల్పడుతోంది
- మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్‌రెడ్డి



మాట్లాడుతున్న ప్రవీణ్‌రెడ్డి

సైదాపూర్: బీఆర్ఎస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందని, గత ప్రభుత్వాలు రైతులకు ఇచ్చిన సబ్సిడీలన్నీ ఎత్తివేసిందని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి ఆరోపించారు. మండలంలోని రాంచంద్రాపూర్‌లో ఆదివారం గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి సీజన్‌లో రైతులకు సబ్సిడీ విత్తనాలు, వ్యవసాయ పనిముట్లు అందజేసిందన్నారు. వ్యవసాయబావులు, బోరుబావులు మంజూరు చేసిందన్నారు. రైతుబంధు ఇచ్చి, రైతులకు ఇచ్చే సబ్సిడీ పథకాలన్నీ ఎత్తివేసిందని, రైతు వ్యతిరేక నిర్ణయాలతో అన్నదాతలను కేసీఆర్ ప్రభుత్వం నట్టేట ముంచిందన్నారు. సంక్షేమ పథకాలు ఎత్తివేసి, రైతుబంధు ఇస్తున్నామని గొప్పలు చెపుతున్నారని అన్నారు. బంగారు తెలంగాణ నిర్మాణంలో అన్ని వర్గాలను మోసం చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఎందరో అమరుల త్యాగాల ఫలితంగా వచ్చిన తెలంగాణలో నీళ్లు, నిధులు, నియామకాలు నినాదం అమలుకు నోచుకోలేదన్నారు. మండల కేంద్రంలో భారత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఐటీ రంగంలో రాజీవ్ గాంధీ సేవలు ఎనలేనివని కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతు సమస్యలను ప్రభుత్వం విస్మరిస్తోంది

జమ్మికుంట: రైతు సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు వీరనేని పర్శరాంరావు అన్నారు. మండలంలోని గండ్రపల్లి గ్రామంలో మాట్లాడారు. యాసంగి పంట నష్ట పరిహారం ఇంతవరకు రైతులకు అందలేదని మండిపడ్డారు. రూ.200కోట్లు విడుదల చేస్తున్నట్లు సీఎం కేసీఆర్ ప్రకటించి రైతులను మోసం చేశాడని ఆరోపించారు. రుణమాఫీ కూడా పూర్తి స్థాయిలో కాలేదని, రైతులపై సీఎం వివక్ష చూపుతున్నారని, ఇప్పటికైనా ప్రభుత్వం పంట నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



రామడుగు: మండలంలోని తిర్మలాపూర్ గ్రామ పరిధిలో ఉన్న వరద కాలువ నుంచి కారుపాకలపల్లి ద్వారా పెంచాలపల్లి, బూరుగుపల్లి వరకు నాలుగు కిలోమీటర్ల మేర బీటీరోడ్డుగా మార్చేందుకు రూ.2.50 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఆదివారం తిర్మలాపూర్ గ్రామస్తులు సీఎం కేసీఆర్, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బి. వినోద్‌కుమార్, చొప్పదండి ఎమ్మెల్యే రవిశంకర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నర్సయ్య, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీకి నివాళి

సాక్షి నెట్‌వర్క్: చొప్పదండి, హుజూరాబాద్, మానకొండూర్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటం, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. నలభై ఏళ్ల వయస్సులోనే దేశ ప్రధానిగా ఎన్నికై శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఎంతో అభివృద్ధి, బడుగు బలహీనవర్గాల సంక్షేమం కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టిన గొప్ప నాయకుడని కొనియాడారు.

బీసీ సబ్‌ప్లాన్ ఏర్పాటు చేయాలి



బొమ్మనపల్లిలో మాట్లాడుతున్న రవీందర్‌గౌడ్

చిగురుమామిడి: రాష్ట్ర వ్యాప్తంగా బీసీ సబ్‌ప్లాన్ ఏర్పాటు చేసి బీసీలను ఆర్థికంగా బలోపేతం చేయాలని, బీసీల్లోని కొన్ని కులాలకు మాత్రమే లక్ష రూపాయల సాయం ఏ మూలకు సరిపోదని బీసీ సంక్షేమ సంఘం హుస్నాబాద్ నియోజకవర్గ కన్వీనర్ పచ్చిమట్ల రవీందర్‌గౌడ్ అన్నారు. ఆదివారం మండలంలోని బొమ్మనపల్లి గ్రామంలో పల్లెపల్లెకూ బీసీ చైతన్య కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పలువురు బీసీ కులాలకు వద్దకు వెళ్లి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జనాభా గణన చేయడంలేదని, జనాభా లెక్కలతో బీసీలకు సగం అసెంబ్లీ స్థానాలు ఇవ్వాల్సి వస్తుందని సీఎం కేసీఆర్ కపటనాటకం ఆడుతున్నారని ఆరోపించారు. ధనిక రాష్ట్రంలో ఉన్నత చదువులు చదువుతున్న బీసీ విద్యార్థులకు రూ.35వేల వరకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కటాఫ్ పెట్టారు, బీసీలకు గొర్లు, బర్రెలు కాదని రాజ్యాధికారంలో భాగస్వామ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఎజెండా లేకపోయిన ఫర్వాలేదని, బీసీ అభ్యర్థికి బీసీలందరం ఓట్లు వేసి తమ సత్తాఏమిటో చూపాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు రాజయ్య, రాజమల్లు, దరిపెల్లి నాగరాజు, చట్ల నాగరాజు, దేవేందర్, తాళ్లపల్లి కుమారస్వామి, కొమిరే పర్శరాములు, పడాల శ్రీనివాస్ పలువురు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో పూజలు



పూజలు చేస్తున్న జీవీ రామకృష్ణారావు

మానకొండూర్‌రూరల్: మండలంలోని శ్రీనివాస్‌నగర్‌లో పెద్దమ్మతల్లి గుడి నిర్మాణానికి ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ రూ.4.60 లక్షల నిధులు మంజూరు చేశారు. ఆదివారం సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావు భక్తిశ్రద్ధలతో పెద్దమ్మతల్లి గుడి గడపకు పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా జీవీఆర్ మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రంలోని అన్నికులాలు, మతాలు, వర్గాలకు సమన్యాయం చేస్తున్నారని అన్నారు. అనంతరం గ్రామప్రజల తరపున ఎమ్మెల్యే రసమయికి కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో జెడ్పీటీసీ శేఖర్, ఎంపీటీసీ రామాంజనేయులు, ఉపసర్పంచ్ భేతి రాజయ్య, నాయకులు కూన శంకర్, చెందు, లక్ష్మినర్సు, సత్తయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

పర్లపల్లిలో ఏకాదశ రుద్రాభిషేకం



రుద్రాభిషేకంలో రమేశ్‌రెడ్డి, సభ్యులు

తిమ్మాపూర్: మండలంలోని పర్లపల్లిలో శ్రీసత్య సేవా సంస్థ ఆధ్వర్యంలో శ్రీ భవాని చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి బీఆర్ఎస్ ఎల్పీ సెక్రెటరీ మాదాడి రమేశ్‌రెడ్డి దంపతులు హాజరై రుద్రాభిషేకంలో పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో సేవా సమితి జిల్లా అధ్యక్షుడు లింగమూర్తి, ఇన్‌చార్జి యాదగిరిరావు, సర్పంచ్ భారతి, ఎంపీటీసీ ముప్పిడి సంపత్ రెడ్డి ఉపసర్పంచ్ రాజేశ్ ఆలయ చైర్మన్ మధుసూదన్ నాయకులు రాజు మహేశ్, తిరుపతి, వంశీ, ఎల్లయ్య, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, వేణు, మధు, భజన మండలి సభ్యులు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు

ఇలాగైతే ఎలా..?

- మురుగునీరు వెళ్లకుండా అడ్డుకట్ట
- దుర్గంధం భరించలేకపోతున్న స్థానికులు

చిగురుమామిడి: చిగురుమామిడిలోని ఎస్సీ(కొత్త) కాలనీలో డ్రైనేజీ నీరు బయటకు వెళ్లకుండా కొందరు అడ్డుకట్ట వేయడంతో దుర్గంధం వెలువడుతోందని కాలనీవాసులు, మాల సంఘం అధ్యక్షుడు బొలుమల్ల రవీందర్, ఉపాధ్యక్షుడు నాగెల్లి అంజయ్య, కోశాధికారి కొప్పుల భాస్కర్, నాగెల్లి పర్శరాములు, రాకం అనిల్‌కుమార్ ఆరోపించారు. ఆదివారం చిగురుమామిడిలో విలేకర్లతో మాట్లాడుతూ... బొలుమల్ల ఎల్లవ్వ ఇంటి నుంచి వెళ్లే డ్రైనేజీలో సుంకపెల్లి సమ్మయ్య ఇంటివద్ద అడ్డుకట్ట వేశారని తెలిపారు. దీంతో దోమల బెడద ఎక్కువై చాలా మంది జ్వరాలబారిన పడ్డారని కాలనీవాసులు తెలిపారు. ఈవిషయంపై సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, ఉపసర్పంచ్‌ల దృష్టికి తీసుకెళ్లినా స్పందనలేకుండా పోయిందన్నారు. రెండు రోజుల్లో పేరుకుపోయిన డ్రైనేజీని శుభ్రం చేయాలని లేదంటే కాలనీవాసులతో కలిసి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో మాల సంఘం అధ్యక్షుడు బొలుమల్ల రవీందర్, ఉపాధ్యక్షుడు నాగెల్లి అంజయ్య, కోశాధికారి కొప్పుల భాస్కర్, నాయకులు నాగెల్లి పర్శరాములు, రాకం అనిల్‌కుమార్, బొలుమల్ల శ్రీధర్, రాజు, బుచ్చవ్వ పలువురు పాల్గొన్నారు.

